నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 10 జనవరి 2024 | KAMAREDDY

## ఠాణా నుంచి దొంగ పరార్



ఇందల్వాయి, జనవరి 9 : ఓ చోరీ కేసులో పట్టుబడిన దొంగ ఠాణా నుంచి పరారైన ఘటన కలకలం రేపింది. చైన్ స్నాచింగ్ కేసులో హర్యానా రాష్ట్రానికి చెందిన ఇద్దరు దొంగలను ఐడీ పార్టీ పోలీసులు కామారెడ్డి ప్రాంతంలో పట్టుకొని డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ లాకప్‌లో ఉంచి విచారిస్తున్నారు. మంగళవారం ఒక దొంగ బాత్‌రూమ్‌కు వెళ్లి బయటికి రాలేదు. అనుమానంతో పోలీసులు పరిశీలించగా బాత్‌రూం కిటికీ అద్దాలు ధ్వంసమై కనిపించాయి. దీంతో దొంగ తప్పించుకున్నట్లు నిర్ధారించుకొని వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పారిపోయిన దొంగ కోసం జాతీయ రహదారి పక్కనున్న హోటళ్లు, ముళ్లపొదలను పరిశీలించారు. సీఐలు, ఎస్సైలు సిబ్బందితో బృందాలుగా ఏర్పాటు చేసి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. చెక్‌పోస్ట్‌లు, టోల్‌ప్లాజా, పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్ డిచ్‌పల్లి ఠాణాకు వచ్చి ఆరా తీశారు. సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## తప్పుల్లేకుండా డాటా ఎంట్రీ

రాజంపేట్, జనవరి 9: ప్రజాపాలన దరఖాస్తులను తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. రాజంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ ప్రక్రియను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా, ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఈ నెల 17వ తేదీలోపు డాటా ఎంట్రీ పూర్తయ్యేలా ఎంపీడీవో, తహసీల్దార్లు పర్యవేక్షించాలని సూచించారు. ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, డీఎల్పీవో సాయిబాబా, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో బాలకిషన్ ఉన్నారు.



భారత రాష్ట్రపతి చేతుల మీదుగా మంగళవారం అర్జున అవార్డును అందుకుంటున్న అంతర్జాతీయ బాక్సర్, ఇందూరు బిడ్డ హుసాముద్దీన్.



## విహంగ సోయగం



**నిండుకుండలా** ఉన్న చెరువులు విహంగాలకు ఆలవాలంగా మారుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వివిధ రకాల పక్షులు చెరువుల్లో సేదతీరుతూ కనువిందు చేస్తున్నాయి. చిట్టి చేపలను వేటాడుతూ, ఆకాశంలో విహరిస్తూ ఆకట్టుకుంటున్నాయి. నిజామాబాద్ జిల్లా చందూర్ మండలం కారెగాం తండాలోని చెరువులో వలస పక్షుల కోలాహలం ఇది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## జాబ్ మేళాకు విశేష స్పందన

### విదేశాల్లో ఉద్యోగాలకు 800 దరఖాస్తులు

ఖలీల్‌వాడి, జనవరి 9 : విదేశాల్లో నియామకాలను సులభతరం చేసేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని ఐటీఐ కళాశాలలో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. టాంకాం, రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దరఖాస్తులను అందజేశారు. మొత్తం 800మంది వివిధ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారని ఉపాధి కల్పన అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇజ్రాయెల్ దేశంలో భవన నిర్మాణ కార్మికులు, షట్టరింగ్ కార్పెంటర్లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ పనులు కల్పించేందుకు జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



జాబ్‌మేళాకు హాజరైన యువకులు

మరిన్ని జిల్లా వార్తలు 8లో..

## సాకులు చెప్పొద్దు..

### నెలాఖరులోపు సీఎంఆర్ పూర్తి చేయాల్సిందే..

రైస్‌మిల్లర్లకు తేల్చిచెప్పిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఉల్లంఘనలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరిక

నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 9: రైతుల నుంచి ప్రభుత్వపరంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ చేపట్టి నెలాఖరులోగా నిర్దేశిత కోటాకనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థకు చేరవేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు రైస్‌మిల్లర్లకు సూచించారు. ప్రతి రైస్‌మిల్లులో పూర్తి సామర్థ్యానికనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టంచేశారు. నిర్లక్ష్యం వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. సీఎంఆర్ లక్ష్య సాధనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్ తదితరులతో కలిసి రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. నిర్ణీత లక్ష్యం మేరకు మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను అందించకపోవడంపై కలెక్టర్ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని తాము ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. జిల్లాలోని రైస్‌మిల్లుల్లో రోజూ కనీసం 6వేల మెట్రిక్ టన్నుల మేర కస్టమ్ మిల్లింగ్ జరిపే సామర్థ్యమున్నప్పటికీ సగటున కేవలం 2వేల మెట్రిక్ టన్నుల వరకే మిల్లింగ్ జరుగుతున్నదని అసంతృప్తి వెలిబుచ్చారు. దాదాపు 35 వరకు మిల్లులు ఇంతవరకు సీఎంఆర్ కేటాయింపులనే ప్రారంభించలేదని ఆక్షేపిస్తూ, నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టమైన హెచ్చరికలు చేశారు. తాము ఎలాంటి సాకులు వినదల్చుకోలేదని అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్ణీత గడువులోపు లక్ష్యానికనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే జిల్లా యంత్రాంగం తరపున తప్పనిసరిగా వాటిని పరిష్కరిస్తామన్నారు. కాగా ఇప్పటికే 2022-23 వానకాలం, యాసంగి సీఎంఆర్ లక్ష్య సాధనకు చేరువలో ఉన్న రైస్‌మిల్లులో 2023-24 వానకాలానికి సంబంధించి కూడా కస్టమ్ మిల్లింగ్ నిర్వహించేలా అనుమతించాలని పలువురు రైస్‌మిల్లర్లు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సమావేశంలో డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయీస్ డీఎం జగదీశ్, ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్ వర్మ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి.మోహన్‌రెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.



రైస్‌మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

## హలో.. ఓటీపీ చెప్పకండి..

సైబర్‌నేరగాళ్ల నయా స్కెచ్

అభయహస్తం దరఖాస్తుదారులే టార్గెట్

ఓటీపీ చెబితే పథకం మంజూరవుతుందంటూ వల

నమ్మితే నట్టేట మునగడమేనంటూ పోలీసుల హెచ్చరిక

అపరిచిత వ్యక్తులకు వివరాలు చెప్పొద్దని అవగాహన





**ప్రజాపాలనలో** మీరు ఇచ్చిన దరఖాస్తు అర్హత సాధించింది. మీకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డు మంజూరైంది. ఫైనల్ వెరిఫికేషన్ కోసం మేం కాల్ చేస్తున్నాం.. మీ పేరు, రసీదు వివరాలు, ఫోన్ నంబర్, బ్యాంక్ వివరాలను చెప్పండి. మేము సరిచూస్తాం. అలాగే మీ మొబైల్‌కు ఓటీపీ వచ్చింది.. చెప్పండి అంటూ మాయచేస్తారు. వాళ్ల మాయమాటలు నమ్మి.. పథకాలు మంజూరయ్యాయనే సంతోషంలో మీ వివరాలు, ఓటీపీ చెప్పారంటే అంతే సంగతులు. మీ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు ఖాళీ అవ్వడం ఖాయం. సైబర్‌నేరగాళ్ల పట్ల తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరిస్తున్నారు పోలీసులు.

– నిజామాబాద్ క్రైం, జనవరి 9

**రాష్ట్ర ప్రభుత్వం** ప్రజాపాలన పేరిట అభయహస్తం పథకాల కోసం స్వీకరించిన దరఖాస్తులపై సైబర్‌నేరగాళ్లు కన్నేశారు. అమాయకులే లక్ష్యంగా ఆన్‌లైన్ వేదికగా మోసాలకు పాల్పడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని టార్గెట్ చేసుకొని, ఓటీపీల పేరుతో దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో ప్రజాపాలన కార్యక్రమానికి పెద్ద ఎత్తున జనం దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 7లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో ప్రజల అవసరం, నాడి తెలుసుకున్న సైబర్‌మోసగాళ్లు కొత్త పంథాను ఎంచుకునే ప్రమాదం ఉన్నదని పోలీసులు చెబుతున్నారు. మీ మొబైల్‌కు కాల్ చేసి మీరు అభయహస్తం పథకాలకు చేసుకున్న దరఖాస్తు సక్సెస్ అయ్యింది, వివరాలు కావాలని కొందరిని మభ్యపెట్టే అవకాశం ఉన్నది. మరికొందరికి కాల్ చేసి మీ దరఖాస్తు తిరస్కరణకు గురైంది, ఆమోదం పొందాలంటే మీ వివరాలు తెలపాలని మరోవిధంగా దగా చేసే అవకాశం ఉన్నది.


### అధికారుల పర్యవేక్షణలోనే డాటాఎంట్రీ ..

అభయహస్తంలో దరఖాస్తు చేసుకున్న వివరాలను ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది డాటా ఎంట్రీ చేస్తున్నారు. డాటా ఎంట్రీ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రభుత్వ సిబ్బంది డోర్ టూ డోర్ వివరాల సేకరణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పకూడదని, అత్యాశతో వివరాలు, ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పినా సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలోని డబ్బులను మాయం చేస్తారని హెచ్చరిస్తున్నారు.

### రూటు మార్చిన సైబర్ మోసగాళ్లు..

గతంలో సైబర్‌మోసగాళ్లు మీకు లాటరీ తగిలిందని, మీరు బహుమతి గెలుపొందారని చెబుతూ అమాయకులను మోసం చేసేవారు. వివరాలు చెప్పాలంటూ ఓటీపీని పంపి ఖాతాలోని డబ్బులను మాయం చేసేవారు. రాష్ట్ర పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించడంతోపాటు పోలీసు స్టేషన్ల పరిధిలో సైబర్ మోసాలపై అవగాహన కల్పించడంతో జనంలో కొంత మార్పు వచ్చింది. దీంతో లాటరీ, బహుమతి అంటూ వచ్చే కాల్స్‌కు దూరంగానే ఉంటున్నారు. దీంతో పద్ధతి మార్చుకున్న సైబర్ కేటుగాళ్లు.. రూటుమార్చి ప్రభుత్వ పథకాలపై పడ్డారు. ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందనగానే ఎంతటి వారైనా తమ వలలో పడడం ఖాయమనే ఉద్దేశంతో కొత్త పంథాలో వెళ్తున్నారు. ప్రభుత్వాలు తీసుకొచ్చి సంక్షేమ పథకం మాటున అమాయకులను దోచేందుకు సిద్ధమయ్యారు.

### ఎవరికీ, ఎలాంటి సమాచారం చెప్పొద్దు..



అభయహస్తం పథకం కోసం దరఖాస్తు చేసుకున్నవారిపై సైబర్ మోసగాళ్లు వేటువేసే అవకాశం ఉన్నది. అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పొద్దు. మీకు ఇల్లు మంజూరైందని, రేషన్‌కార్డు వచ్చిందని అందుకోసం మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని అడిగినా స్పందించొద్దు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పోతే వెంటనే సైబర్ హెల్ప్ సెల్ 1930 నంబర్‌కు 24గంటల్లోపు ఫిర్యాదు చేయాలి.

- కిరణ్‌కుమార్, ఏసీపీ, నిజామాబాద్

### పోలీసుల అప్రమత్తం... అవగాహన ముమ్మరం

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న అభయహస్తం కార్యక్రమాన్ని అదనుగా చేసుకొని మోసం చేసే అవకాశం ఉన్నదని సైబర్ టెక్నాలజీ సెల్ అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సైబర్ మోసగాళ్లు ఫోన్ చేసి మాయమాటలు చెప్పి లూటీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, ఎట్టిపరిస్థితుల్లో మొబైల్‌కు వచ్చే ఓటీపీ, బ్యాంకు వివరాలను చెప్పకూడదని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అత్యాశకు వెళ్లి వివరాలు చెబితే మీ బ్యాంకు అకౌంట్లలో ఉండే డబ్బులను సైబర్ నేరగాళ్లు మాయం చేసే అవకాశం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. పొరపాటున వివరాలు చెబితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

## చోరీ చేసి.. ఉల్టా కేసు పెట్టి..

పోలీసులకు చిక్కిన బ్యాటరీల దొంగ

సూపర్‌వైజరే ప్రధాన సూత్రధారి

ఆరుగురు నిందితుల అరెస్టు

బాన్సువాడ డీఎస్పీ వెల్లడి

బాన్సువాడ, జనవరి 9: బీఎస్‌ఎన్‌ఎల్‌లో అతనో సూపర్‌వైజర్. పని చేసే సంస్థకే కన్నం పెట్టాడు. బ్యాటరీలను మాయం చేసిన వ్యక్తే ఉల్టా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు.. ప్రధాన సూత్రధారి సూపర్‌వైజర్ సహా ఆరుగురిని కటకటాల్లోకి పంపించారు. కేసు వివరాలను బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. రాజన్నసిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణరావు పేట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్.. కామారెడ్డి జిల్లాలోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ల బ్యాటరీలకు సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. వృత్తి రీత్యా కామారెడ్డిలోని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతనితో పాటు టవర్ల వద్ద గడ్డి కత్తిరించే కూలీలైన ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బోడమీది రాజు, గాంధారి మండలం జువ్వాడి గ్రామానికి చెందిన గొలుసు లింగం, మ్యాతరి సాయిలు, గైని మైసయ్యలు ముఠాగా ఏర్పడ్డారు. సంవత్సరం క్రితం నుంచి జిల్లాలోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ల వద్ద ఉండే బ్యాటరీలను దొంగిలించడం ప్రారంభించారు. ఈ నెల 2వ తేదీన ఐదుగురూ కలిసి తాడ్కోల్ శివారులో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ వద్ద బ్యాటరీలను చోరీ చేస్తుండగా, అదే సమయంలో టవర్ టెక్నీషియన్ రాగా తప్పించుకొని పారిపోయారు. ఈ నెల 8న ఉదయం 8.30 గంటలకు బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా, కారులో వస్తున్న నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు వెంబడించి పట్టుకుని ఆరా తీయగా బ్యాటరీల చోరీ విషయం బయటపడింది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 9 గ్రామాల్లోని టవర్ల వద్ద 264 బ్యాటరీలను మాయం చేసి, వాటిని కామారెడ్డిలోని ఖలీల్ పాత ఇనుప సామగ్రి దుకాణంలో విక్రయించినట్లు గుర్తించారు. ఖలీల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, హైదరాబాద్‌లో కొన్ని బ్యాటరీలను విక్రయించినట్లు వెల్లడించాడు. మిగిలిన 72 బ్యాటరీలను, అలాగే బ్యాటరీల విక్రయంతో వచ్చిన రూ.1.50 లక్షల నగదును, దొంగతనాలకు వాడిన టాటాఏస్ ఆటో, కారును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులతోపాటు బ్యాటరీలను కొనుగోలు చేసిన ఖలీల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై చంద్రయ్య, జగన్నాథంతోపాటు పోలీసు సిబ్బందిని అభినందించారు.



అదుపులోకి తీసుకున్న నిందితులు, స్వాధీనం చేసుకున్న బ్యాటరీలతో పోలీసులు



**జిల్లా స్కూల్ గేమ్స్** ఫెడరేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ స్థాయి అండర్-17 బాలుర కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. విద్యాభారతిపై ఉత్తరాఖండ్ ఒక్క పాయింట్‌తో, పాండిచ్చేరిపై 8పాయింట్లతో ఢిల్లీ విజయాలు సాధించాయి. తెలంగాణ- విద్యాభారతి జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో తెలంగాణ జట్టు 15పాయింట్లతో విజయం సాధించింది. తమిళనాడుపై ఢిల్లీ 12 పాయింట్ల తేడాతో గెలిచింది.

–కామారెడ్డి, జనవరి 9